
# మాఊరి దెయ్యం కథ

సుంకర.వి. హనుమంతరావు



అర్ధరాత్రి బాలయ్య బృందానికి 'పేరంటాలు' ఇంటి అరుగు మీద 'తెల్లచీరకట్టుకుని, జుట్టు విరబోసు కుని- ఆడదెయ్యం కన్పించిందనే వార్త కోడికూయకముందే 'కారు కూతలా' వ్యాపించి పోయింది బందరు కాలువ గట్టునున్న మా 'వల్లూరు పాలెంలో'.

ముఖాలు కూడా కడుక్కోకుండా 'ముష్టివార్తల కోసం' ముందూ వెనుకా చూసుకోకుండా మూగి పోయే 'న్యూస్ ఛానళ్ల జనాల్లా' ఇటువంటి వార్తా ప్రసారాలకు మూలకేంద్రమైన 'కోటిగాడి బల్లకట్టు' మీదకు వాలిపోయాం నేను, నాతోబాటు నా గోలీకా యల టీం.

అప్పటికే బాలిగాడు బల్లకట్టు మధ్యలో బాసింపట్టు వేసుకుని దెయ్యం ఎపిసోడ్ని మెదడు కాకుండా బుర్ర పెరిగి చెయ్యి తిరిగిన రచయితలా వర్ణించేస్తున్నాడు. బల్లకొట్టు కోటిగాడు గడేయడం ఆపేసి కథలు వినడమే తప్ప తీయడం చేతకాని నిర్మాతలా వీర ఏకాగ్రతతో వినేస్తున్నాడు.

కోతల కోసం వల్లూర్నుంచొచ్చిన రైతుకూలీల బృందం బల్లకట్టు కోసం చూస్తూ అది అటూ యిటూ కాకుండా మధ్యలోనే ఆగిపోతే. అర్థంగాక బుర్రలు గోక్కుంటుంటే ఆ బృందనాయకురాలు నాగరత్నం ఓరి కోటిగా తెడ్డేయడంరాని మొద్దోడిలా అలా బిగుసుకుపోనావేట్రా? బేగొచ్చెయ్ పొద్దెక్కిపోతన్నాది ఆలీసమైపోనాదంటే పీనాసి రంగయ్య పిసికేసుకుంతాడు అంటూ అరిచిన అరుపుకు ఉలిక్కిపడిన కోటిగాడు బొంగుతో సహా కాలవలోపడిపోయాడు. అప్పటిదాకా అయోమయంగా బుర్రలు గోకేసుకున్న అమ్మాయిలంతా కిసుక్కున నవ్వేసారు.

మేం పిల్లకాయలందరం తేరుకునే లోపే గడతో బాటు ఈదుకుంటూ వచ్చిన కోటిగాడు గడబొంగు మా కందించి నీట్లోనే వుండిపోయాడు.

పైకి రారా అంటే వూహు అంటూ తలూపాడు.

మా బ్యాచ్లో కాస్త ఏపుగా పెరిగి నైన్త్క్లాస్లోనే గడ్డాలు మీసాలు మొలిపించేసుకున్న నాగేశుగాడు. గెడేసి బల్లకట్టును ఒడ్డుకుచేర్చాడు.

బిలబిలమంటూ తోసుకుంటూ ఎక్కేసిన నాగరత్నం బృదం నీళ్ళల్లోంచి పైకిరాని కోటిగాడిని నీళ్ళలో కొట్టుకుపోతున్న కోటిగాడి పంచెను చూస్తూ ఒకళ్ళ మీదొకళ్ళుపడిపోయి పడీపడీ నవ్వారు.

మా క్కూడా లైట్లు వెలగడంతో ఒరేయ్ కోటిగా నీ పంచెరోయ్ అంటూ అరిచేసాం.

పంచెకోసం ఈదితే కుక్కీతరాని కోటిగాడు తన బ్యాకంతా బయటే వుంటుందనే విషయం ఫ్లాషయినట్లు గమ్మునుండిపోయాడు. లోన చెడ్డీ లేదని తర్వాత చెప్పాడు.

''ఒసే సీతాలూ మా కెవరికీ లోలంగాలు లేవు గానీ నీదిప్పిచ్చెయ్ కట్టుకుని పైకొత్తాడు కొడుకు'' అంటూ తన బృందంలో సోకులాడిగాపేరుపొందిన సీతాలికి కన్నుగీటింది నాగరత్నం.

అంతే అమ్మాయిలంతా నవ్వులపువ్వుల్లా బల్లకట్టుతో బాటు అటూయిటూ వూగిపోయారు.

''అరేయ్ కోటిగా నీళ్ళల్లో జలగలూ చేపలుంటాయి బేగొచ్చెయ్ నేకపోతే నీపెళ్ళాం భాగ్య బతుకు బండలైపోద్ది'' అంటూ ముక్తాయింపిచ్చి నాగరత్నం వెళ్ళిపోతే కోటయ్య యింటి పక్కనుండే కిట్టిగాడు లగెత్తుకెళ్ళి పంచె తెచ్చిచ్చాడు.

నీళ్ళలోనే పంచెకట్టుకుని పైకొచ్చిన కోటిగాడు ''చెప్పరా బాలిగా''అంటూ మళ్ళీ నిర్మాతైపోయాడు.

రాత్రి రెండో ఆట చూసివత్తన్నాం. టైం ఒంటిగంట దాటుంటుంది బొడ్డపాడు దాకా చాలా మందున్నారు అక్కడ్నుంచి మనూరి కొచ్చే మేం నలుగురమే మిగిలాం.

చెరువు కట్ట దగ్గరకు రాగానే నువ్వు చెప్పిన కొరివి దెయ్యం కథ గుర్తు చేసాడు ఇదిగో వీడే కిట్టిగాడు.

అప్పట్నుంచి ఒకటే దడ నలుగురూ చేతిలో చెయ్యేసుకుని గుంతల్లోగోతుల్లో పడుకుంటూ లేస్తూ మనూరి పొలిమేరకాడి కొచ్చేశాం. పేరంటాలింటి ముందు ఆగి రేవులో కూర్చుని ఆఖరిదమ్ము లాగుదామనుకున్నాం ఎప్పటిలాగే.

అగ్గిపుల్ల గీయబోతుంటే ''అరేయ్ అటుచూడండ్రా దెయ్యం దెయ్యం అంటూ మన ఫ్యాక్టరీ సైరన్లా అరిచాడు – వీడే మన మల్లిగాడు.''

''నేనేం అరవలా అటుచూడండ్రా అన్నాను'' అంతే ఉబుకుతున్న ఉక్రోషాన్ని అదిమిపెట్టుకుంటూ గొణిగాడు మల్లిగాడు.

''నీయమ్మ రామాయణంలో పిడకల వేటేంట్రా ముందు జరిగిందేంటో చెప్పండహె'' ఆతృతను అణుచుకోలేని కోటిగాడు గట్టిగా అరిచేసాడు.

''అందరం అటుచూసాం నిజమే గోడమీద దెయ్యం డాన్స్ చేస్తోంది. అంతే ఆ తర్వాత ఏమైందో గుర్తు లేదుగానీ ఫ్యాక్టరీ ముందు పడుంటే వాచ్మేన్ రామయ్య మా అందరినీ ఇళ్ళకు చేర్చాడని ఆ తర్వాత తెల్సింది. అసలారాత్రంతా అయోమయంగా గడిపాం''.

''మరి దెయ్యం సంగతి ఊళ్ళో జనాలకెవరు చెప్పారో? దెయ్యం చూసి బోసుగాడు నిక్కరు తడిపేసుకున్నాడు. ఆ రాత్రి వాళ్ళమ్మ వీడిని నిలదీస్తే చెప్పాడట'' కోటిగాడి ప్రశ్నకు బాలిగాడు సమాధానం చెప్పాడు.

''ఏం అదరుష్టంరా మీది? నా కెప్పట్నుంచో దెయ్యాన్ని చూడాలనే కోరికుంది నాకు చూపించండిరా''.

బ్రతిమాలాడు కోటిగాడు.

కోటిగాడ్ని చూస్తే మా అందరికీ జాలేసింది. వాడూ మాతోడి స్టూడెంటే అయితే ఏడోతరగతి మూడోసారి తప్పడంతో వాళ్ళయ్య ఓబులేసు బడి మాన్పించి బొంగు చేతిలో పెట్టి బల్లకొట్టు నడపమాన్నాడు. అప్పటికిమేం నైన్త్ దాటేశాం. కోటిగాడు ఓ యింటోడయ్యాడు.

స్కూలు నుంచి వచ్చాక ప్రోగ్రాం ఫిక్స్ చేద్దామనుకున్నాం. ఆరోజు స్కూల్లో వున్నవి మా శరీరాలే గాని మనసంతా దెయ్యం చుట్టూ వేయబోయే ప్రోగ్రాం చుట్టూనే తిరుగుతావుంది. స్కూలయ్యాక పుస్తకాలెక్కడపారేశామో? ఏం తిన్నామో కూడా పట్టించుకోకుండా బల్లకట్టు మీదకు వాలిపోయాం.

ఆరింటికి వచ్చేశారు. నాగరత్నం అండ్ కో వచ్చే రావడంతోనే ''అద్దేట్రా అల్లుడూ అలా పడిపోనావు ఏటయిందేటి?'' అంటూ నాగరత్నం ఆరా అడిగితే,

''రాత్రి మనోళ్ళకు దెయ్యం కనపడిందట. ఆ దెయ్యం గురించి చెప్తుంటే శ్రద్ధగా వింటూ నీ అరుపుకు ఉలిక్కిపడి జారిపడ్డానే అత్తా'' అని వివరించాడు కోటిగాడు.

''ఈడికా ఏరా బాలీసూ మసక మసక చీకట్లో లేచి ఊరిపొలిమేరల్ని పంటకాలవల్ని గోరీల దొడ్డిలను దాటుకుంటూ తిరిగే మాలో ఎవరికీ కన్పించని దెయ్యం నీకు కన్పించిందా? మొత్తం కన్పించిందా? మోకాళ్ళదాకా దర్శనమిచ్చిందా?'' సుబ్బిశెట్టి లెవెల్లో డైలాగ్ చెప్పి పడీపడీ నవ్వింది నాగరత్నం.

బాలీసూ దేవుడూ దెయ్యాలనేవి ఎక్కడో వుండవురా, మనలోనే వుంటాయి. మంచిపని చేసినోడ్ని దేవుడంటారు. అదే చెడ్డపనిచేస్తే దెయ్యమంటారు. మీ పంతుళ్ళు మీకు చెప్పలా? అరే కోటిగా 'ఎడ్డోడు యాపారం చేత్తే గుడ్డోడు క్యాష్లెక్క బెట్టాడట' ఈడిమాటలు నమ్మబాక

బాలిగాడి ముఖం కోపంతో మరింత నలుపెక్కిపోయింది. ఏదో చెప్పబోతే సీతాలును ముందుకు లాగి ''ఒరయ్యా బాలీసూ మా సీతాలు మంచి గేలప్ మీదుంది గానీ ఓ మంచి దెయ్యాన్ని చూపించి పుణ్యం కట్టుకోరాదూ?'' అంటూ జోకేస్తే ఆడంగులతా అద్దిరిపోయేలా నవ్వేసారు.

పాపం బాలిగాడి ముఖం పాలిపోయింది.

అంతమంది అమ్మాయిల ముందు షేమైపోయాడు.


''అయినా బాలీసూ దేవుడూ దెయ్యాలనేవి ఎక్కడో వుండవురా మనలోనే వుంటాయి. మంచి పని చేసినోడ్ని దేవుడంటారు. అదే చెడ్డపనిచేస్తే దెయ్యమంటారు. మీ పంతుళ్ళు మీకు చెప్పలా? అరే కోటిగా 'ఎడ్డోడు యాపారం చేత్తే గుడ్డోడు క్యాష్లెక్క బెట్టాడట' ఈడిమాటలు నమ్మబాకో'' అంటూ బాలిగాడి బుగ్గమీద ఒక్కపోటుపొడిచింది.

''నిజం చెప్పావత్తా ఏయ్ పిల్లలూ ఈ బాలీసుగాడేదో చిటికలేత్తన్నాడుగానీ ఆడిమాటలు నమ్మమాకండి'' అంటూనే నన్ను దగ్గరకు తీసుకుని బుగ్గమీద ముద్దు పెట్టేస్తూ నాగేశుగాడ్ని చూసి కన్నుకొట్టింది.

నాగేశుగాడు సిగ్గుపడిపోతే 'ఛీ ఎంగిలి' అంటూ చొక్కాకాలర్తో బుగ్గ తుడుచుకుంటుంటే నన్ను చూస్తూ ''రవిబాబూ బుగ్గకందిపోయుంటాది. మీ అమ్మమ్మతో చెప్పి కాపడం పెట్టించుకో'' అని నాగరత్నం నవ్వేస్తే మిగతా అమ్మాయిలు కోరస్గానవ్వేశారు.

వెళ్తూ వెళ్తూ నన్నుచూపిస్తూ ''ఈ రవిబాబాక్కుడు తప్ప అందరూ వీర ముదుర్లే'' అనే సర్టిఫికెటొకటిచ్చి నాగరత్నం బృందం బల్లకట్టుదిగి వెళ్ళిపోయారు.

''ఒరేయ్ అమాయక బాలుడా నువ్వు అమాయకుడివా? సీతాలు ముద్దుపెట్టిందని మీ తాతయ్యతో




చెప్తాం'' అంటూ నా మీద దాడికి దిగిపోతే బిక్క ముఖం పెట్టేసాను.

''ఎహె సొల్లాపంండ్రా ముందు దెయ్యం విషయం చూడండ్రా'' అంటూ అసహనంగా అరిచేసాడు కోటి గాడు.

అయితే రేపు దెయ్యాన్ని చూడాలంటావ్?

బాలిగాడి మాటలకు ''రేపుకాదు ఈ రాత్రికే చూడాలి'' అంటూ కోప్పడిపోయాడు కోటేసు.

''అబ్బో రాత్రి పదింటికల్లా పక్కెక్కకపోతే... పనుపుతాడు తీస్తాడు మా అయ్య'' బోసుగాడు తన బాధను చెప్పాడు. ఆ తర్వాత అందరం అదే భావాన్ని వ్యక్తం చేశాం.

''అయితే – యివాళ్టికి నువ్వొక్కడివే చూసెయ్! ఆదివారం అందరం సినిమాకెళ్ళి వచ్చేటప్పుడు చూద్దాం' నాగేశుగాడు చిట్కా చెప్పాడు. కోటిగాడు గతుక్కుమన్నాడు. ఆడి ప్రతాపం మా అందరికీ తెలిసిందే.

''అట్లయితే వద్దుగానీ ఆదివారమేఖాయం'' భయాన్ని బయటపడనీయకుండా – మాకోసమే నిర్ణయం మార్చుకున్నట్టు కన్ఫం చేశాడు కోటి గాడు.

***

ఆరోజు రాత్రి విషయమంతా మా తాతయ్యతో చెప్పాను. ఆయన గలగలా నవ్వేసి – ''మీ అందరికీ చదవేస్తే వున్న మతి పోయింది. చదువు రానిదైనా నాగరత్నం చక్కగా చెప్పింది. వచ్చే ఆదివారం మీ కళ్ళతో మీరే చూస్తారుగా. పిచ్చిపిచ్చి ఆలోచనలు చేయకుండా నిద్రపో'' అంటూ తాతయ్య చేత్తో జోకొడుతుంటే నిద్రలోకి జారిపోయాను.

ఆ రాత్రంతా అటూయిటూ కదులుతూ, ఏవేవో పలవరిస్తూనే వున్నానట – 'అదుగో దెయ్యం' అంటూ.

ఆ రాత్రంతా చూడబోయే సినిమా గురించి కాకుండా దెయ్యం గురించి కలలే కలలు!

ఇలా జరగడం యిదే మొదటిసారి నాకు.

***

ఎదురుచూసిన ఆదివారం వచ్చేసింది. రెండో ఆట కూడా అయిపోయింది. మొత్తం ఎనిమిదిమందిమున్నామన్న ధైర్యంతో చెరువు కట్ట దాకా వీరలెవెల్లో వచ్చేశాం. చెరువు కట్టను చూడగానే అందరి మనసూ దెయ్యాల మీదకు దొర్లిపోయింది. టాపిక్కూడా మారిపోయింది.

''కోటేసూ! అప్పుడెప్పుడో... ఈ చెరువు దగ్గర 'కొరివిదెయ్యం' కన్పించిందని చెప్పావు. అది మళ్ళీ కన్పించిందా?'' అమాయకంగా అడిగాడు మల్లిగాడు.

అంతే.. అందరి గుండెల్లోనూ 'ఢామ్మని' పేలిన ఫీలింగ్. దాంతో లెవెల్ మారిపోయింది. అడుగులు తడమడుతుంటే – పెదాలు వణుకుతుంటే – ఆడపెళ్ళివారిలా అడుగులేస్తూ పొలిమేర దాటేశాం. దాదాపు పేరంటాలింటి దగ్గరకొచ్చేశాం.

పున్నమి వెన్నెల పచ్చపూవులా వుంది. చందమామను కమ్మేసిన మబ్బులు కదిలిపోతుంటే చంద్రుడే పరుగెడుతున్న ఫీలింగ్. చల్లగా వీస్తున్న పిల్లగాలికి మైమరిచిపోయి – ప్రకృతి సౌందర్యంలో లీనమైపోయాను. అదీ... అయిదు క్షణాలే!

అప్పుడు అరిచాడు బాలిగాడు.

''అదుగో అక్కడే చూశాం'' వాడు వేలెత్తి చూపించిన గోడవైపు చూస్తూ షాకైపోయాం

గోడమీద తెల్లగా వున్న ఆకారం ... మెల్లగా కదులుతోంది.

అందరం కళ్ళు మూసేసుకున్నాం. కళ్ళు తెరవాలంటే భయం. నాగేశుగాడు 'చెల్లియో... చెల్లకో' అంటూ వణుకుతున్న కంఠంతో.. పద్యాన్ని లంకించుకున్నాడు. చప్పుడు చేస్తే... దెయ్యం పారిపోతుందని వాళ్ళ తాతెప్పుడో చెప్పిన చిట్కా అప్పుడు గుర్తొచ్చి అలా పాడానని తర్వాత చెప్పాడు.

కళ్లు మూసుకుని – గుడ్డోడిలా నడుస్తున్న బోసుగాడు – మైలురాయి తగిలి 'బొక్క బోర్లా' పడిపోతూ 'చచ్చాన్రోయ్' అని అరిచిన కేక ఒకటే గుర్తుంది. ఆ తర్వాత అంతా చీకటే!

ఈ సంఘటన జరిగి ఆరు సంవత్సరాలైనా – అప్పుడప్పుడూ అర్ధరాత్రిపూట 'ఫ్లాషై పోయి' అమ్మో... దెయ్యం వస్తే? అన్న ఫీలింగ్ వస్తుండేది. మంచి నీళ్ళు తాగి.. మళ్ళీ నిద్రకోసం ప్రయత్నించేవాడిని.

అయితే ఈమధ్యే ఓ మ్యారేజి ఫంక్షన్‌లో పేరంటాలు మనుమడు విష్ణు కనిపించడంతో గతమంతా గుర్తుకొచ్చింది. ఆ సంఘటన జరిగినప్పుడు విష్ణు డిగ్రీ చేస్తుండేవాడు. ఆ సంవత్సరమే మేం హైద్రాబాద్‌కు షిఫ్ట్ అయిపోవడంతో ఆ గోడమీది దెయ్యం ఏమయిందోనన్న క్యూరియాసిటీ అలాగే వుండిపోయింది.

అదే అడిగేశాను విష్ణుని– 'మళ్ళీ దెయ్యం కనిపించిందా?' అని. ముందు అయోమయంగా చూసినా – ఏదో ఫ్లాషయినట్టు పకపకా నవ్వేసి, పక్కనున్న భార్యను చూస్తూ ... కనపడడమేమిటి? తనతోనే కాపురం చేస్తుంటే అన్నాడు. అప్పుడు పరిశీలనగా చూశాను – విష్ణు భార్యను. మా వూరమ్మాయే – 'ఇందిర'. తనప్పుడు ఇంటర్ చదువుతుండేది.

''అంటే?'' అన్నాను అర్థంకాక.

''అంటే ఏముంది? బాలయ్య బృందం ప్రతి రోజూ అర్ధరాత్రి వరకూ మా ఇంటిముందే మకాంపెట్టేవాళ్లు కదా? మాకేమో చాలా యిబ్బందిగా ఉండేది'' అన్నాడు ఇందిర్ని చూస్తూ.

అర్థంకాలేదు నాకు. అదే అన్నాను.

''అప్పుడు మేం ప్రేమాయణంలో వున్నాం. వూరంతా సద్దుమణిగాక తను మా యింటికొచ్చేది. బాలయ్య బృందం కంటబడితే వూరంతా 'టాంటాం' చేస్తారని... వాళ్ళను బెదరగొట్టాలని ... తనే ... తెల్లచీర...''

''అర్థమైపోయింది. కానీ .. మేమంతా స్వయంగా...''

''చూశామనుకున్నది దెయ్యంకాదు. ఆరోజు పౌర్ణమి. గుర్తుందా? మా యింటిముందున్న చెట్టు నీడ గోడమీద పడి కదులుతుంటే – బాలయ్య అరవడం – నాగేశు పాట లంకించుకోవడం... బోసుగాడు బోర్లా పడడం ... కోటేసుగాడు కళ్లు తేలేయడం... ఈ సీనన్నీ మాయింటి కిటికీలోంచి చూస్తూ ... నవ్వాపుకోలేకపోయాం తెలుసా?''

విష్ణు మాటలతో ఏంఫ్లాషయిందో గాని... ఇందిర సిగ్గు మొగ్గ అవడం – ఆరు సంవత్సరాల 'లఘు శంక' ... ఐ మీన్ చిన్న అనుమానం తీరిపోవడం.. నాకో మంచి కథ దొరకడం.. ఒకే ఒక్క క్షణంలో జరిగిపోయాయి.

★